
సాక్షి మంచిర్యాల

ఆదివారం । 4 । జూన్ । 2023



అనగనగా ఓ ఊరు 10లో▸

అది గిరిజన పల్లె.. అడవితల్లి ఒడిలో ఒంటరిగా మిగిలిన ఊరు. అక్కడికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. ఆస్పత్రికి వెళ్లడమూ కష్టమే. అభివృద్ధికి దూరంగా ఉన్న ఇస్లాంపూర్‌పై కథనం.

నేడు సురక్ష దినోత్సవం

మంచిర్యాలక్రైం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 4న సురక్ష దినోత్సవం నిర్వహించనున్నట్లు డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హై లైఫ్ హోటల్‌లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
42.0 /30.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. వాయువ్యం దిశగా వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులు, అనుబంధ శాఖల అధికారులు ఉత్సవాల నిర్వహణలో ప్రత్యేక అధికారులుగా నిమగ్నమైనందున, 22వరకు జరిగే ఉత్సవాల ముగింపు వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. తిరిగి నిర్వహించే వివరాలను ప్రకటన ద్వారా తెలియజేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

10న జాతీయ మెగా లోక్ అదాలత్

మంచిర్యాలక్రైం: ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి బీ.సత్తయ్య అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం పోలీస్ ఎక్సైజ్, బ్యాంకు, ఇన్సూరెన్స్ సంబంధిత శాఖల అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కోర్టుల పరిధిలో ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇరువర్గాల కక్షిదారులతో మాట్లాడి రాజీ కుదిర్చే విధంగా చర్యలు చేపట్టాలని, కక్షిదారులు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్ల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్‌కుమార్, న్యాయమూర్తులు అజయ్‌ఉల్లం, ఉపనిషధ్వని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం మంచి వ్యాయామం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: సైకిల్ తొక్కడం మంచి వ్యాయామమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. శనివారం ప్రపంచ సైకిళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సైకిల్‌ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో శారీరక శ్రమ లోపించడం వల్ల జీవనశైలిలో కలిగే మార్పులతో వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. ప్రజల్లో ఎక్కువ మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని, ఇందుకు వ్యాయామం తప్పనిసరిగా చేస్తూ, అవసరమైన మందులు క్రమం తప్పకుండా వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయపూర్ణిమ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్, డీపీఎం ప్రశాంతి, డెమో బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వాసల లింగారెడ్డి, జి.రామమూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, గుండేటి నాందేవ్, ప్రేమ్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే కలెక్టరేట్



భవనాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి సమీకృత కలెక్టరేట్ భవనాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం ఆయన నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9న కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రానున్నారని, అధికారులు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పనులు వేగవంతం చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. అంతర్గత రోడ్లు, గ్రీన్ కారిడార్, మురుగు కాలువ వ్యవస్థ, తాగు నీరు, విద్యుత్ సరఫరా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ ఈఈ పెద్దన్న, జిల్లాల ఉద్యానవన శాఖ అధికారి రాజ్‌కుమార్, మంచిర్యాల, చెన్నూర్, జైపూర్ తహసీల్దార్లు రాజేశ్వర్, శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ దారికి ఆరు కోట్లు!

- చర్చనీయాంశంగా బెల్లంపల్లి చౌరస్తా రోడ్డు విస్తరణ
- భూమి బదులు డబ్బులు చెల్లించేందుకే మొగ్గు
- మధ్యవర్తిత్వంతో చక్కబెట్టేందుకు ప్రయత్నాలు
- పరిహారం ఇవ్వడం మొదలైతే మరిన్ని వివాదాలు



జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో పరిహారం వివాదంతో వెలిసిన ఫెన్సింగ్ పోల్స్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలో బెల్లంపల్లి చౌరస్తా నుంచి బైపాస్ వరకు వెళ్లే రోడ్డు విస్తరణ పనులు వివాదాస్పదంగా మారాయి. భూ యాజమానికి పరిహారం చెల్లింపులో పాలకవర్గం, అధికారులు ఉత్సాహం చూపుతున్నారని గత కొంతకాలంగా ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగే ముందు రోజు రాత్రే సేకరించాల్సిన భూమిలో స్తంభాలతో ఫెన్సింగ్ వెలిశాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ స్తంభాలు వేయడం లోనూ యాజమానికి పరోక్షంగా కొందరు మద్దతు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత 45ఏళ్లుగా ఈ వివాదం ఉండగా, బెల్లంపల్లి చౌరస్తా వద్ద జంక్షన్ నిర్మాణం చేపట్టడంతో మరింత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పరిహారం రూ.6.34కోట్లు

జిల్లా కేంద్రంలో కీలక రోడ్డుగా ఉండగా.. ప్రైవేటు ఆసుపత్రులు అధికంగా ఉండడం, బైపాస్ రోడ్డు కలుపుతూ ఉన్న 80ఫీట్ల దారిని విస్తరించేందుకు మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సర్వే నంబరు 208, 2019లో 1815గజాల భూమి రోడ్డు విస్తరణకు అవసరమైంది. మార్కెట్‌లో భారీగా డిమాండ్ ఉన్న తమ భూమికి పరిహారం ఇస్తేనే భూమి ఇస్తామని యాజమాని లక్సెట్టిపేట, ఆసిఫాబాద్, మంచిర్యాల కోర్టుల్లో కేసులు వేశారు. చివరకు 2016లో హైకోర్టు 'భూ సేకరణ చట్టం 2013' అనుసరించి రోడ్డు విస్తరణ చేపడితే భూమి కోల్పోతున్న వారికి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ చట్టం అనుసరించి విలువ కడితే రూ.6,34,44,670 పరిహారం చెల్లించాలి. ఆ మొత్తం మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ (ఎల్ఆర్ఎస్) కింద కట్టిన డబ్బులు ఇచ్చేందుకు అప్పటి మున్సిపల్ కమిషనర్ బాలక్రిష్ణ ఉన్నప్పుడు కౌన్సిల్ ఎజెండాలో చర్చలు, ఆమోదం వరకు వెళ్లాయి. ఈ పరిహారం ఇవ్వడంలో పాలకవర్గంలోని కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులకు పెద్ద ఎత్తున డబ్బులు అందుతున్నాయని, వాటాల వివాదంతోనే ముందుకు సాగలేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మరోసారి ఆ భూమిలో యాజమాని పోల్స్ వేసి, కౌన్సిల్‌లో చర్చించడం, యాజమానికి పరిహారం ఇచ్చేలా ప్రజాప్రతినిధులే నచ్చజెప్పే ప్రయత్నాలు మళ్లీ జరుగుతున్నాయి.



బెల్లంపల్లి చౌరస్తాలో చేపట్టిన జంక్షన్ పనులు

ఎందరో భూములు కోల్పోయినా...

పట్టణ అభివృద్ధికి ప్రధానమైన మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ కోసం ఎంతోమంది తమ విలువైన భూములు కోల్పోయారు. ఎక్కడా ఇప్పటివరకు ఎవరికీ పైసా పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు. గతంలో ఓసారి అండర్ బ్రిడ్జి నిర్మాణంలో ఓ వ్యక్తి ఇల్లు కోల్పోతే నిర్వాసితుడికి మాత్రమే నివాస ప్లాట్ వేరే చోట ఇచ్చారు. మిగతా ఏ రోడ్డు విస్తరణలో పరిహారం ఇవ్వలేదు. ప్రజావసరాల కోసం చాలామంది రోడ్ల విస్తరణకు సహకరించారు. తాజా వివాదంలో కోర్టుకు వెళ్లడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిని తీసుకునేందుకు ముందడుగు వేయలేకపోతున్నారు. మరో వైపు మాస్టర్‌ప్లాన్ పరిధిలో ఆ భూమి ఉండడంతో ఆ భూ యాజమాని ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణం చేపట్టినా, మున్సిపాలిటీ నుంచి అనుమతులు వచ్చే అవకాశాలు లేవు. దీంతో ఆ జాగాలో సొంతంగా నిర్మాణాలు చేపట్టలేక, ఎవరికి అమ్ముకోలేక ఉండిపోవాల్సిన పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలో హాట్ కేక్ లాంటి ఈ భూమి ఉపయోగం లేకుండా పోవడంతో ఎలాగైనా పరిహారం ఇచ్చేలా చేయడంలో కొందరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. పరిహారం డబ్బులకు బదులు భూమి మరో చోట నిర్వాసితులకు ఇచ్చేలా ప్రతిపాదన పెడితే అందుకు ఒప్పుకోలేనట్లుగా చెబుతున్నారు. ఈ క్రమంలో పరిహారం చెల్లించేందుకు అంతా ఒక్కటై కథ నడిపిస్తున్నారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గం స్థానిక ఎమ్మెల్యే వరకు ఈ పరిహార వ్యవహారం తీసుకెళ్లారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో చేపడుతున్న వంద ఫీట్ల రోడ్లకు ఆనుకున్న ఉన్న ప్రతీ చోట ఇదే తీరుగా పరిహారం కోసం కోర్టులకు వెళ్తే మున్సిపాలిటీ నుంచి పెద్ద మొత్తంలో పరిహారం చెల్లించాల్సి వస్తోందనే అభ్యంతరాలు ఉన్నాయి. ఎన్నికల ముందు పట్టణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందనే కారణంతో ఈ వ్యవహారాన్ని పెండింగ్‌లో పెట్టే అవకాశాలు ఉన్నాయి.

బడిబాట ప్రారంభం

- మొదటి రోజు 151 మంది ప్రవేశాలు
- ఒకటో తరగతిలో 102 మంది
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి 49 మంది



ప్రచారంలో బాలుర ఉన్నత పాఠశాల టీచర్లు

మంచిర్యాలఅర్బన్: బడిబాటలో భాగంగా స్కూళ్లలో సౌకర్యాలపై ఉపాధ్యాయులు శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. విద్యాసంవత్సరం పునః ప్రారంభానికి ముందే జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 17వరకు బడిబాట కార్యక్రమం సాగనుంది. ఇంటింటా ప్రచారంతో పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. ఆంగ్లమాధ్యమంలోనూ నాణ్యమైన చదువుపై అవగాహన కల్పించారు. మొదటి రోజు ఒకటో తరగతిలో 102 మంది ప్రవేశాలు పొందారు. 2వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రైవేటు నుంచి 49మంది ప్రభు త్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు.

దుస్తులు, పుస్తకాలు, భోజనం, ఆంగ్లం

సర్కారు పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు మెరుగుపర్చింది. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, విశాలమైన తరగతి గదులు తదితర వసతులపై ప్రచారం చేపట్టారు. డిజిటల్ బోర్డులు, ఉచితనోట్ పుస్తకాలపై ఉపాధ్యాయులు వివరించారు. ఉదయం 7గంటల నుంచి 11వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. ఇందుకు అవసరమైన ర్యాలీలు, కరపత్రాల పంపిణీ చేశారు. ఆంగ్లబోధనపై అవగాహనతో కల్పించడంతోపాటు తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. నూతన ప్రవేశాలకు విద్యార్థుల పేర్లు, తల్లిదండ్రుల చిరునామా నమోదు చేసుకున్నారు.

పోలీస్‌శాఖలో సాంకేతిక విప్లవం



ప్రాణహిత సరిహద్దు ప్రాంతంలోని ప్రజలతో మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి(ఫైల్)

- అరచేతిలో సమగ్ర నేర సమాచారం
- సెక్యూరిటీ యాప్‌తో ఉపయోగాలెన్నో
- అందుబాటులోకి టీఎస్ కాప్ అప్లికేషన్స్
- ఒక్క క్లిక్ నొక్కితే నేరస్తుల గుట్టు రట్టు
- నేడు సురక్ష దినోత్సవం

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పోలీసు శాఖ మరింత పటిష్టంగా మారింది. సాంకేతిక విప్లవంతో అంచనాకు అందనంత ఎత్తున దూసుకెళ్తోంది. ఆర్థిక, అక్రమ, సైబర్ క్రైం నేరాలు, అనుకోని విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. నేరస్తుల సమగ్ర సమాచారం టీఎస్ కాప్స్ అప్లికేషన్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. పోలీసుల తనిఖీ సమయంలో విచారణ నుంచి ఎవరూ తప్పించుకోలేరు. నేరస్తుల సమాచారం పోలీసుల సెల్‌ఫోన్‌లో ఒక్క క్లిక్ నొక్కగానే లభ్యమవుతుంది. నేరాల అదుపునకు పోలీసులు టీఎస్ కాప్స్ అప్లికేషన్స్ వినియోగిస్తున్నారు. 12 రకాల యాప్స్‌ను నిక్షిప్తం చేశారు. నేరస్తుల ఇళ్లను జియో ట్యాగింగ్ చేశారు. ఈ యాప్స్ ప్రతీ పోలీసు అధికారి, సిబ్బంది, బ్లూ కోల్ట్స్, క్రైం ఇన్వెస్టిగేషన్ అధికారి, కోర్టు కానిస్టేబుళ్లు, పెట్రోకార్ పోలీసులకు అందుబాటులో ఉన్నాయి. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం సురక్ష దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కొత్త పోలీసుస్టేషన్ల ఏర్పాటు

పరిధి తగ్గితే శాంతిభద్రతలు కాపాడేందుకు కొంత మేర అధికారులపై భారం తగ్గుతుంది. జిల్లా ఏర్పడిన తర్వాత ప్రారంభంలో 23 పోలీసుస్టేషన్లు ఉండగా.. కొత్త మండలాలు ఏర్పడిన తర్వాత మరో మూడు పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశారు. భీమారం, కోటపల్లి, సీసీసీ నస్పూర్ స్టేషన్ల భవనాలను అధునాతనమైన హంగులతో నిర్మించారు.

నిరంతర గస్తీ

నేరాలు నిరోధించడం, నేరస్తులను పట్టుకునేందుకు సరికొత్త యాప్‌లతో బ్లూ కోల్ట్స్ పోలీసు ద్వారా ప్రజలకు సేవలు వేగవంతం చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. డయల్ 100కు కాల్ చేస్తే నిర్ణీత సమయంలో సంఘటన స్థలానికి చేరుకుని 24/7 అందుబాటులో ఉంటున్నారు. జిల్లాలో 26 బ్లూ కోల్ట్స్ టీమ్‌లో 51మంది, 10 పెట్రోకార్‌లో 16మంది పోలీస్ సిబ్బంది గల్లీగల్లీ తిరుగుతూ గస్తీ కాస్తున్నారు.

వేలి ముద్రల సేకరణ

నేరాలను త్వరగా ఛేదించేందుకు జిల్లాలోని పాత నేరస్తుల వివరాలు, వేలిముద్రలు సేకరించారు. సాంకేతిక నిపుణుల సహాయంతో వేలిముద్రలను లైవ్ స్కానర్స్, మొబైల్ డివైస్‌ల ద్వారా జిల్లాలో 52 కేసుల్లో నేరస్తులను పట్టుకొని పెండింగ్ కేసుల చిక్కుముడి విప్పారు. జిల్లాలో 49,335మంది నేరస్తులు, అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. జిల్లాలో 187 సైబర్ కేసులు నమోదు కాగా రూ. 1,52,51,424కోట్లు ఫ్రీజ్ చేశారు. 12 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తులను అరెస్ట్ చేశారు.

నిఘా..

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పోలీస్ శాఖ భావిస్తోంది. జిల్లాలో 10వేల సీసీటీవీ కెమెరాల ఏర్పాటు లక్ష్యం కాగా.. ఇప్పటికే 6,441 ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తున్నారు. సీసీ టీవీ కెమెరాల ద్వారా వందల సంఖ్యలో కీలకమైన నేరాలను ఛేదించారు.

పీడీ యాక్ట్‌లో నమోదులో రెండో స్థానం

అక్రమాలకు పాల్పడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, భూ కబ్జాలు, గంజాయి, కలప, పేకాట, అక్రమ రవాణా, అక్రమ దందాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు అమలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 62మందిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. పీడీ యాక్ట్ కేసుల నమోదులో రామగుండం పోలీస్ కమిషనరేట్ తెలంగాణలో రెండో స్థానంలో ఉంది.

సీఈఐఆర్ పోర్టల్..

ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా కనుగొనేందుకు ఇటీవల సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చారు. ఇది అమల్లోకి వచ్చిన నెలన్నర రోజుల్లో జిల్లాలో 29సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు.

మహిళా భద్రతకు షీ టీమ్స్..

సీఎం కేసీఆర్ సింగపూర్ పర్యటన తర్వాత తెలంగాణలో మహిళలపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు, మహిళల భద్రత కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేశారు. ఒక్క కాల్ చేస్తే చాలు నిమిషాల వ్యవధిలో మఫ్టీలో ఘటన స్థలానికి చేరుకుని ఆకతాయిల భరతం పడుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 1,253 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 19మంది ఆకతాయిలపై కేసులు నమోదు చేశారు. విద్యాసంస్థలు, ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో షీ టీమ్స్ పోలీసులు మఫ్టీలో రక్షణ కల్పిస్తున్నారు.

బాలల సంరక్షణ

బాలల సంరక్షణ కోసం కార్మిక, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో పోలీస్‌శాఖ ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, రైల్వేస్టేషన్, బస్టాండ్, ఫుట్‌పాత్, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద సంచరిస్తున్న పిల్లలను రక్షించడం, పిల్లల అక్రమ రవాణా నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1618మంది పిల్లలను చేర నుంచి విడిపించి కొందరిని విద్యాసంస్థల్లో చేర్పించారు. మరికొందరిని తల్లిదండ్రులకు అప్పగించారు.

నేరస్తులు తప్పించుకోలేరు..



టీఎస్ కాప్స్ యాప్స్ ద్వారా నేరస్తులను ఎలా పట్టుకోవాలి, కష్టతరమైన కేసులను ఎలా ఛేదించాలనే అంశాలు అందుబాటులో ఉంటాయి. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ఒక్క క్లిక్‌లోనే నేరస్తుల గుట్టురట్టవుతోంది. ఎంతటి కరుడుగట్టిన నేరస్తుడైనా పోలీసుల నుంచి తప్పించుకోవడం అనేది సాధ్యం కాదు.

– సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ, మంచిర్యాల

నేడు నిర్మల్‌కు కేసీఆర్



బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు

- ముఖ్యమంత్రిగా తొలిసారి రాక..
- కలెక్టరేట్, బీఆర్ఎస్ భవన్ ప్రారంభం..
- మరో ఏడు కార్యక్రమాల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- 'క్రషర్‌గ్రౌండ్'లో బహిరంగసభ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ
- గులాబీమయమైన జిల్లాకేంద్రం

నిర్మల్: సీఎం హోదాలో కేసీఆర్ తొలిసారి ఆదివారం నిర్మల్ జిల్లాకు వస్తున్నారు. 2018, నవంబర్ 22న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఖానాపూర్, నిర్మల్, భైంసా బహిరంగ సభల్లో పాల్గొన్నారు. సీఎం హోదాలో జిల్లాకు అధికారిక పర్యటన కోసం రాడం ఇదే మొదటిసారి. నిర్మల్‌లో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మరో ఏడు కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొంటారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎం జిల్లాకు వస్తారని సమాచారం. కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలకడంతోపాటు కలెక్టరేట్ ప్రారంభోత్సవం, బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వారం రోజులుగా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యటన పనులను నిరంతరం పరిశీలిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలతోపాటు బహిరంగసభకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సీఎం పాల్గొనే కార్యక్రమాలివే..

హైదరాబాద్ నుంచి నేరుగా నిర్మల్ చేరుకున్న తర్వాత సీఎం కేసీఆర్ స్థానిక కొండాపూర్ బైపాస్ వద్ద నిర్మించిన బీఆర్ఎస్ భవన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం సమీకృత కలెక్టరేట్(ఐడీఓసీ) ప్రారంభంతోపాటే మిగతా పనులకు అక్కడి నుంచే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు.

- ఎల్లపెల్లి శివారులో రూ.56 కోట్లతో రోడ్లు భవనాలశాఖ నిర్మించిన ఐడీఓసీ(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్)ను ప్రారంభిస్తారు.
- జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- సారంగపూర్ మండలం చించోలి(బి)లో మైనార్టీ బాలుర గురుకులాన్ని ప్రారంభిస్తారు.
- తెలంగాణ డెయిరీకి సంబంధించిన మినరల్ మిక్చర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తారు.
- గిరిజన సంక్షేమశాఖ ద్వారా మూడు నియోజకవర్గాల్లో నిర్మించిన బీటీరోడ్లు, వంతెనలు ప్రారంభిస్తారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఐకే రెడ్డి

- గిరిజన సంక్షేమశాఖ జిల్లాకేంద్రంలో నిర్మించిన బంజారాభవన్‌ను ప్రారంభిస్తారు.

క్రషర్‌గ్రౌండ్‌లో బహిరంగసభ..

కొత్త కలెక్టరేట్ రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొంటారు. దాదాపు లక్షమంది హాజరయ్యేలా సభాప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్ సభ ఏర్పాట్లు, జనసమీకరణను పర్యవేక్షించారు. ఎన్నికలకు ముందు జరగనున్న సీఎం సభ కావడంతో భారీగా జనసమీకరణకు ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్మల్‌తోపాటు ముధోల్, ఖానాపూర్ నుంచి భారీగా జనాన్ని తరలించేలా చర్యలు చేపట్టారు.

గులాబీమయం..

చాలారోజుల తర్వాత జిల్లా కేంద్రంలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఎటుచూసినా గులాబీ జెండాలు, సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికే ఫ్లెక్సీలతో నింపేశారు. సీఎం పర్యటన సాగే ప్రాంతమంతా గులాబీమయమైంది. కొత్త కలెక్టరేట్‌నూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల లైటింగ్, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అధికారుల చాంబర్లనూ ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కలెక్టరేట్‌తోపాటు, మిగితా పనులకు సంబంధించిన శిలాఫలకాలనూ అక్కడే ఏర్పాటు చేశారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీళ్లు, బటర్‌మిల్క్ అందించనున్నారు.

పటిష్ట బందోబస్తు..

ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసు బలగాలను మోహరించారు. సీఎం ప్రారంభించే కలెక్టరేట్, బీఆర్ఎస్ భవన్, ఇతర కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ముందస్తుగా సూచించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ఇతర నేతలు, మీడియా ప్రతినిధులకు పర్మిషన్ లేదు. బహిరంగసభకు మాత్రమే అందరికీ అనుమతి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈమేరకు బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బీఆర్ఎస్ పాలనలోనే రైతులకు పెద్దపీట
- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గురిజాల, కన్నాల రైతువేదికల్లో నిర్వహించిన రైతు దినోత్సవానికి కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. రైతుబీమాతో రైతుల కుటుంబాలకు బాసటగా నిలుస్తోందని తెలిపారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పరికరాల కోసం ప్రభుత్వం రూ.17 కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. రైతుబంధు కింద రూ.1448 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం రైతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కన్నాలలో చిన్నయ్య రైతులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్యామలదేవి, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్‌లు రంజిత, స్వరూప, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, ఏడీఏ సురేఖ, ఎంపీడీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య, కలెక్టర్

క్లుప్తంగా

ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని జంగల్‌పేటకు చెందిన మానపెల్లి జంపయ్య ఈ నెల 1వ తేదీన మన్నెగూడెం నుంచి బైక్‌పై వస్తుండగా ఫోన్ పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించి గురువారం ఎస్సై శ్యాం పటేల్ బాధితుడికి అప్పగించారు. మండలంలో ఎవరైనా సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

గురువయ్యను సత్కరించిన గవర్నర్



గురువయ్యను సత్కరిస్తున్న గవర్నర్

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ బుల్‌బుల్ సితార్ కళాకారుడు చుంచు గురువయ్యను శుక్రవారం రాత్రి రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సత్కరించారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన గురువయ్య బుల్‌బుల్ సితార్ వాయిద్యాన్ని విరామం లేకుండా 7 గంటల పాటు వాయించినందుకు ఇప్పటికే ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డును అందుకున్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో కనీసం 7 గ్రేడ్, ఆపైన సాధించిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికిగానూ ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు epass. cgg@telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 11 సాయంత్రం 5 గంటల్లోపు వివరాలు నమోదు చేసుకోవాలని, 14న విద్యార్థుల ఎంపిక జాబితా కార్యాలయం నోటీసు బోర్డుపై ఉంచడం జరుగుతుందన్నారు. 16, 17 తేదీల్లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఎంపికైన విద్యార్థుల ఒరిజినల్ ధృవపత్రాలను పరిశీలించడం జరుగుతుందనట ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ శతాబ్ది ఆర్గానిక్ ప్రొడక్ట్‌కు డిస్ట్రిబ్యూట్ చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలర్స్ కావలెను. వివరాలకు ఫోన్ : 9966189898 [H-778997]

■ హైదరాబాద్ 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్,సె॥గార్డ్స్, సూ॥ వైజర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీ. 15000–30000. ఫోన్:7981515640,9989930582. [H-781313]

FACULTY TEACHERS

■ English Teachers' Training to get Trained, Certified & Get Highly Paid Jobs in TOP 500 Edu. Inst. Cont.: Ph : 9248481331 [HA-14648]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

అదో ఏళ్లనాటి గిరిజన పల్లె... అడవితల్లి ఒడిలో ఒంటరిగా మిగిలిన ఆ ఊరికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. కడెం మండల కేంద్రం నుంచి మూడు వాగులు దాటి గంటపాటు ప్రయాణం చేస్తే ఆ పల్లెకు చేరుకోవచ్చు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడం కష్టతరమే. అలాంటి సమయాల్లో ఎందరో ఆదివాసీ అభాగ్యులు ప్రాణాలు వదిలారు. అయినా పట్టించుకునే దయార్ద్ర హృదయులు లేరు. నింగికి రాకెట్‌ను పంపించే అత్యాధునిక యుగంలో ఆ ఊరికి కనీసం ఫోన్ సిగ్నల్ కూడా రాని పరిస్థితి. చుట్టూ ఇబ్బందులున్నా.. ఎవరినీ నిందించకుండా వన్యప్రాణులతో స్నేహం చేస్తూ.. అడవితల్లి ఒడిలో అలరారుతున్న 'ఇస్లాంపూర్'పై ప్రత్యేక కథనం. – జన్నారం



అనగనగా ఓ ఊరు..

- మౌలిక వసతులకు నోచుకోని తీరు..
- అభివృద్ధికి ఆమడ దూరంలో ఇస్లాంపూర్
- జనావాసాలకు 15 కిలోమీటర్ల దూరంలో గ్రామం
- రోడ్డు లేక రాకపోకలకు ఆదివాసీల ఇబ్బంది
- ప్రాణాలు పోతున్నా పట్టింపులేని అధికారులు



వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని తాడు సాయంతో పైకి లాగుతున్న దృశ్యం (ఫైల్)

ఇస్లాం స్థాపించిన గ్రామం

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలోని ఇస్లాంపూర్ శతాబ్దాల క్రితం వెలిసిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రజాకార్ల పాలనలో ఇస్లాం అనే వ్యక్తి ఆ గ్రామానికి వచ్చి అడవిలో తలదాచుకుని గిరిజనులతో మమేకం కావడంతో ఆ గ్రామానికి ఇస్లాంపూర్ అని పేరు వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అడవిని నరికి సాగు చేసుకుని ఆదివాసీలు అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో ఆదివాసీలు అడవి సంపద అయిన పుట్టతేనె, ఫలాలపై ఆధారపడి జీవించారు.

126 ఇండ్లు.. వెయ్యికి పైగా జనాభా

గ్రామంలో 60 గోండు కుటుంబాలు, 45 కొలాం కుటుంబాలు, 15 నాయకపోడ్ కుటుంబాలు, 6 నేతకాని కుటుంబాలు, వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. ఉడుంపూర్ గ్రామ పంచాయతీలోని ఈ గిరిజన గూడేన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది.

ఎటువెళ్లినా పది కిలోమీటర్లు..

దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎడ్లబండ్ల బాటలో రాకపోకలు సాగిస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని జన్నారం మండలం కవ్వాల్‌కు రావాలంటే 15 కిలో మీటర్లు, కడెం మండలం ఉడుంపూర్‌కు రావాలంటే 9 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిందే. రేషన్ సరుకుల కోసం ఉడుంపూర్, అవసరాల నిమిత్తం అత్యధికంగా గిరిజనులు జన్నారం మండల కేంద్రానికి రావాల్సిందే.

రోడ్డు లేక నరకయాతన..

వందల ఏళ్ల క్రితం ఏర్పడిన ఆ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. దట్టమైన అడవులు ఉండడంతో అటవీశాఖ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు వేయాల్సిందే. మూడు వాగులు దాటితే తప్ప జనావాసాల్లోకి రాలేని పరిస్థితి. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగితే మూడు నెలలపాటు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడినవారు వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. బైక్‌పై బలవంతంగా తీసుకెళ్లినా వాగులు దాటే లోగా ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

చదువుకు దూరమవుతున్న విద్యార్థులు



అసంపూర్తిగా పాఠశాల భవనం


గ్రామంలో 36 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. లక్సెట్టిపేట నుంచి ప్రతిరోజు ఉపాధ్యాయుడు వచ్చి పాఠాలు బోధిస్తాడు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి రాకపోకలు స్తంభించడంతో మూడునెలల పాటు ఉపాధ్యాయుడు రాలేని పరిస్థితి. దీంతో గ్రామంలో ఎవరైనా చదువుకున్న వారితో లేదా వీవీని పెట్టుకుని పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. నూతన పాఠశాల భవనం ఆరేళ్ల క్రితం మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణం పూర్తికాలేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్నే గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటర్‌గా వినియోగిస్తున్నారు.

పట్టింపులేని పాలకులు, అధికారులు

గ్రామం ఏర్పడి వందల ఏళ్లు కావస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని గిరిజనులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం మాత్రమే వస్తారని, ఆతర్వాత మర్చిపోతారని చెప్తున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టర్, ఖానాపూర్ ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, మా సమస్యలపై స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఇస్లాంపూర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, చెరువులు నిర్మించడంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



వాగులో చిక్కుకున్న బైక్‌ను బయటకు తీస్తున్న యువకులు (ఫైల్)



ఇస్లాంపూర్‌కు అడవి నుంచి వెళ్లే దారి ఇదే

అభివృద్ధికి అటవీశాఖ అడ్డు...

ఎమ్మెల్యే రేఖానాయక్ చొరవతో ఉడుంపూర్ నుంచి ఇస్లాంపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు, చెరువుల నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ అటవీశాఖ క్లియరెన్స్ లేకపోవడంతో ఆ నిధులు మళ్లిపోయాయి. మిషన్ భగీరథకు అనుమతి లేకపోవడంతో నల్లానీటిని ఆ గ్రామం నోచుకోలేదు. గ్రామ పంచాయతీలో నీటి ట్యాంకు నిర్మాణం ప్రారంభించారు. సామగ్రి తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామంలో ఉన్న మూడు చేతిపంపుల నీటిని తాగడానికి, ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. అవి చెడిపోతే తాగునీటికి తంటాలు పడాల్సిందే.

ఎందరికో పురుడు పోసిన



గర్భిణులను ఆస్పత్రులకు తరలించే అవకాశం లేకపోవడంతో చాలామంది గిరిజన మహిళలకు నేనే పురుడు పోసిన. కొన్ని సందర్భాల్లో కొంతమంది చనిపోయారు. ఎప్పటి నుంచో ఉంటున్న మా ఊరికి సౌకర్యాలు లేవు. ఇక్కడే పుట్టిన వాళ్లం ఇక్కడే చస్తాం కానీ బయటకు వెళ్లలేం.
– జంగుబాయి, గ్రామస్తురాలు

రోడ్డు సౌకర్యం కల్పించాలి



నేను పుట్టినప్పటి నుంచి చూస్తున్న. మా ఊరు ఇలాగే ఉంది. ఇక్కడి నుంచి వేరే ఊరికి పోవడానికి మాకు రోడ్డు లేదు. వాగులు వంకలు దాటుకుంటూ అడవిలో నుంచి వెళ్లాలి. వానాకాలం రాకపోకలు ఉండవు. మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.
– కనక రాము, ఇస్లాంపూర్

చెరువు నిర్మించాలి



గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఎలాంటి ఫలితం లేదు. గ్రామంలో చెరువు నిర్మాణం చేపడితే రైతులు పంటలు పండించుకుంటారు. దీనిపై అధికారులు, పాలకులు పట్టించుకోవాలె.
– కనక విజయ్‌కుమార్, ఎంపీటీసీ

సమస్యలు తీర్చలేకపోతున్న



మా గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం సీసీ రోడ్డు పనులతో పాటు వైకుంఠ దామం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులను మాత్రమే నిర్మించాం. గ్రామానికి రోడ్డు లేక సామగ్రి తేలేకపోతున్నాం. వాహనాలు ఇక్కడికి రావు. దీంతో అభివృద్ధి జరుగడం లేదు.
– కనక జైతు, సర్పంచ్

అటవీశాఖ క్లియరెన్స్ ఇవ్వడం లేదు



ఇస్లాంపూర్ అభివృద్ధికోసం ముఖ్యమంత్రితో మాట్లాడి రోడ్డు, చెరువు నిర్మాణం కోసం నిధులు తెప్పించా. కానీ అటవీశాఖ క్లియరెన్స్ ఇవ్వలేదు. నా సొంత నిధులతో సీసీరోడ్డు నిర్మించా. నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాం. నేడు జిల్లాకు రానున్న సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తా.
– అజ్మీరా రేఖానాయక్, ఎమ్మెల్యే

సీఎం ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ నెరవేర్చాలని ఈ నెల 9న జిల్లాకు రానున్న ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, మల్లయ్య, బానయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలపై సీఎం స్పందించాలి

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై స్పందించాలని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజ్ గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఏరియాలోని కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పిట్ కార్యదర్శి వెంకటేశ్, బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు రాజేందర్, సంజీవ్, శ్రీనివాస్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

'గిరి వికాస్' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రమాదేవి

కోటపల్లి(చెన్నూర్): గిరి వికాస్ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి అధికారి రమాదేవి అన్నారు. మండలంలోని ఆలుగామలో పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆరుగురు రైతులకు గిరి వికాస్ పథకంలో బోరు బావులు మంజూరు కాగా శనివారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు బోరు బావుల ద్వారా పంటలకు సాగు నీరందిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. బోరు బావులు మంజూరైనప్పటికీ అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని గత నెలలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంపీపీ మంత్రి సురేఖ స్పందించారు. అటవీశాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి బోరుబావులు వేసేలా కృషి చేశారు.

తాత సంవత్సరీకం రోజే మనుమడు మృతి

- వడదెబ్బతో కూలీ హఠాన్మరణం
- కెలిబిలో విషాదం



గావుత్రే పోశెట్టి (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): తాత సంవత్సరీకం రోజే మనుమడు మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని కెలిబి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కెలిబి గ్రామానికి చెందిన గావుత్రే లక్ష్మణ్ ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని సంవత్సరీకం కార్యక్రమాన్ని శుక్రవారం చేయాలని నిర్ణయించారు. లక్ష్మణ్ కుమారుడు శంకర్ పొలంలో సంప్రదాయబద్ధంగా జెండా ఎగురవేశారు. అక్కడే భోజనాలు ఏర్పాటు చేశారు. శంకర్ కుమారుడు గావుత్రే పోశెట్టి(35) కార్యక్రమాలన్నీ మండుటెండలో దగ్గరుండి చేయడంతో వడదెబ్బ తాకింది. అనంతరం కడుపులో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. రాత్రి బహిర్భూమికి వెళ్లివచ్చిన తర్వాత వాంతులు చేసుకుని అక్కడికక్కడే మృతి చెందాడు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



బండారి శ్రీనివాస్



ఓదెల రామస్వామి



రాజయ్య

రెబ్బెన/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా కైరిగూడ ఓసీపీలో ఈపీ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బండారి శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గనికి చెందిన ఓదెల రామస్వామి, కాసిపేట–2 గనిలో కోల్‌కట్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజయ్య ఎంపికయ్యారు. కంపెనీ స్థాయిలో ఎంపికైన ఉద్యోగులను ఈ నెల 5న కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సింగరేణి యాజమాన్యం సన్మానించనుంది.

ఫిష్ ఫెస్టివల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: ఈ నెల 8 నుంచి 10 వరకు జిల్లాలో నిర్వహించనున్న ఫిష్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లామత్స్యశాఖ అధికారి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు చేపల ద్వారా వివిధ రకాలైన ఆహార ఉత్పత్తులు, వాటి నుంచి వచ్చే పోషక విలువలు, వివిధ రకాల రుచులు పరిచయం చేసేందుకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 10 స్టాళ్లలో వివిధ రకాలైన రుచికరమైన చేపలు, రొయ్యల వంటలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అనుభవం కలిగిన వారు, ఔత్సాహికులు వారి వంటల నైపుణ్యం ద్వారా వివిధ రకాలను తయారు చేసి ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్ఐటీహెచ్ఎంలో శిక్షణ పొందిన మహిళలు, మహిళా మత్స్యకారులు, మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాల వారు, మత్స్య పారిశ్రామిక సహకారసంఘాలు, ఆసక్తి గల స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ రుచులతో పాటు, ఉపాధి అవకాశం కూడా లభిస్తుందని, ఆసక్తి గలవారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అవగాహన లేకనే ఒప్పందంపై విమర్శలు

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



సీతారామయ్యను సన్మానిస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వేతన ఒప్పందాలపై సరైన అవగాహన లేని కొందరు నాయకులు తాము చేసుకున్న 11వ వేతన ఒప్పందంపై ఆరోపణలు చేస్తున్నారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియాతో కొట్లాడి 19 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్, 24 శాతం అలవెన్సులను పెంపుదల చేశామన్నారు. దీంతో మొదటి కేటగిరీ కార్మికునికి రూ. 10 వేలు, సీనియర్ కార్మికునికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనాలు పెరుగుతున్నాయన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోయే ఒప్పందం అన్నారు. కార్మికులకు ఏరియర్స్ సుమారు రూ.2.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రానున్నాయన్నారు. ఈ సందర్భంగా వేజ్ బోర్డులో చేసుకున్న ఒప్పంద వివరాలను వెల్లడించారు. మెరుగైన వేతన ఒప్పందం సాధించినందుకుగానూ కార్మికులు ఈ సందర్భంగా సీతారామయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గుర్రం నరసయ్య, గునిగంటి నర్సింగరావు, పిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు చిలుక రాంచందర్, కారుకూరి నగేష్, కంది శ్రీనివాస్, బాలసాని లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియాస్థాయిలో ఉత్తమ ఉద్యోగులు వీరే..

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులను అధికారులు ప్రకటించారు. ఆర్కే 5 నుంచి హెడ్ ఓవర్‌మెన్ పీ.మల్లారెడ్డి, ఐకే1ఏ గని నుంచి సపోర్ట్ మెన్ పోశయ్య, ఆర్కే 7 గని ఎస్‌డీఎల్ ఆపరేటర్ టి.రమేశ్, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని నుంచి సీనియర్ అండర్ మేనేజర్ మల్లారెడ్డి, ఎస్ఆర్పీ 3, 3ఏ గని సీనియర్ అండర్ మేనేజర్ కే.అరుణ్‌కుమార్ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనట్లు డీజీఎం అరవిందరావు తెలిపారు. వీరిని ఈ నెల 5న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో జరిగే సింగరేణి సంబరాల్లో ఘనంగా సన్మానించనున్నారు.

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియా నుంచి ఉత్తమ ఉద్యోగులుగా కేకే ఓసీ సీనియర్ అండర్ మేనేజర్ ఎండీ యూసుఫ్, కేకే–5 గని ఈఈ పందిళ్ల నవీన్‌కుమార్, ఆర్కే–1ఏ గని జనరల్ మజ్దూర్ జి.శ్రీనివాస్, శాంతిఖని గని ఫిట్టర్ వై.విజయ్‌కుమార్, ఆర్కే సీహెచ్‌పీలో ఫోర్‌మెన్ (మెకానికల్) మురళీకృష్ణ ఎంపికైనట్లు ఏరియా జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు.

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా కైరిగూడ ఓసీపీకి చెందిన డీవై సూపరింటెండెంట్ బొచ్చు నరేష్, ఈపీ ఆపరేటర్ ఎల్లబోయిన రమేశ్, గోలేటి సీహెచ్‌పీ డీవైజీఎం భీంరావు జాడే, ఫోర్‌మెన్ గిరిగిరి రాజేశ్, ఏరియా ఆస్పత్రి స్టాఫ్ నర్స్ విజయశీల, ఏరియా స్టోర్స్ ఇష్యూ మజ్దూర్ గుర్జాల రమేశ్, సివిల్ డిపార్టుమెంట్ జనరల్ మజ్దూర్ కార్మికుడు మడెపు శివానందచారి, ఏరియా వర్క్‌షాప్ ఫోర్‌మెన్ ఇన్‌చార్జి నూనె లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు.

కేసీఆర్ చొరవతోనే కారుణ్య నియామకాలు



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సీఎం కేసీఆర్ చొరవతోనే సింగరేణిలో కారుణ్య నియామకాలు అందుబాటులోకి వచ్చాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కైరిగూడ ఓసీపీలో అన్‌ఫిట్ అయిన కార్మికులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులు నేడు సింగరేణిలో ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు కార్మికులంతా రుణపడి ఉంటారన్నారు. సింగరేణిలో 2018 నుంచి ఇప్పటి వరకు సుమారు 15వేల కొత్త ఉద్యోగాలు కారుణ్య నియామకాల ద్వారా భర్తీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, పిట్ కార్యదర్శి వెంకన్న, మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.